క్లుప్తంగా

సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న బృందం సభ్యులు

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామంలో ఆదివారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. బృందం సభ్యులు 2023–24 సంవత్సరంలో గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను గత మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేశారు. సీఆర్పీ పాండురంగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, తనిఖీ బృందం సభ్యులు, కూలీలు తదితరులు ఉన్నారు.

ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి పోషక విలువలు కలిగిన వివిధ ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈవో రమణారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కళాజాత ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కుంటాల: మండలంలోని వెంకూర్‌లో ఆదివారం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కళాకారులు అవగాహన కల్పించారు. ఆరు గ్యారంటీలు, సమగ్ర కుటుంబ సర్వే, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై ఆటపాటల ద్వారా కళాకారులు వివరించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ, ఎలిశెట్టి సుదర్శన్, తోట లక్ష్మణ్, టి.సుధాకర్ స్వామి, సి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడెం: మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఆదివారం లలిత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు డాక్టర్లు మహేశ్‌బాబు, లలితలు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. రాణిగూడ మాజీ సర్పంచ్ ఉర్వేత భీంబాయి అనంద్‌రావు, దేవిదాస్, జైల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఏజీపీకి ఘన సన్మానం



ఆసిఫ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా నియామకమైన పట్టణంలోని కరీంకాలనీకి చెందిన న్యాయవాది ఆసిఫ్ అలీని మదీనా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ ఫహీమ్, జహీర్ హైమద్, అలీం, ఖాజా, హైమద్, షారు, తదితరులు ఉన్నారు.


నూతన కార్యవర్గం

భైంసాటౌన్: బంగారం, వెండి వర్తక సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ సమీపంలో సంఘం ప్రతినిధులు రాములు, భూమన్న, ప్రకాశ్, రవీంద్రమూర్తి సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మైస గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కోర్వ శ్రీకాంత్ ఎన్నికైనట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.

గుంతలు పూడ్చివేత

భైంసారూరల్: ఇలేగాం –దేగాం గ్రామాల మధ్య 3కిలోమీటర్ల మేర ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు పడ్డాయి. పెద్ద గుంతలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ గుంతల రోడ్డుపై ఆదివారం ఇలేగాం గ్రామానికి చెందిన కౌటిక్‌వార్ కృష్ణమూర్తి సొంత డబ్బులతో మొరం వేయించారు. బీటీ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు.

చిత్రలేఖనంలో భళా..!



పాఠశాల గోడలపై విద్యార్థినులు వేసిన చిత్రాలు

- ఆసక్తి చూపుతున్న భైంసా గురుకుల విద్యార్థినులు
- ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోకి ప్రవేశించగానే గోడలపై కళాత్మక, సందేశాత్మక చిత్రాలు దర్శనమిస్తాయి. వాటిని చూస్తే ఎవరో చేయి తిరిగిన పెయింటర్ వేసి ఉంటాడని అనుకుంటాం. కానీ అవన్నీ గీసింది ఆ పాఠశాల విద్యార్థినులే. సాధారణంగా కాగితాలపై చిత్రాలు వేయడం మామూలే. కానీ గోడలపై, పెద్దపెద్ద చిత్రాలు, అందంగా గీయడం సాధన ద్వారానే సాధ్యమవుతుంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహానికి తోటి విద్యార్థినుల సాయం తోడవడంతో అపురూప చిత్రాలు గీసి భళా అనిపించుకుంటున్నారు. పాఠశాల సందర్శన కోసం వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని చూసి ముచ్చట పడుతున్నారు. విద్యార్థినుల ఆసక్తి గమనించి ప్రోత్సహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పేర్కొంటున్నారు.



పాఠాలు గుర్తుండేలా..



పుస్తకాల్లోని పాఠాలు గుర్తుండాలనే ఉద్దేశంతో కొన్ని చిత్రాలను గోడలపై గీయించారు. దీంతో వాటిని చూడగానే పాఠ్యాంశం జ్ఞాపకం వస్తుంది. వీటితోపాటు ఇతర చిత్రాలు కూడా గీశాం.

– అనుజ్ఞ, విద్యార్థిని, పదో తరగతి

చిత్రలేఖనం అంటే ఆసక్తి...



చిత్రలేఖనం అంటే ఆసక్తి ఉంది. కాగితాలపై బొమ్మలు గీస్తుంటాను. మా పాఠశాలను అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గోడలపై పాఠ్యాంశాల్లోని చిత్రాలు, సందేశాత్మక చిత్రాలను గీశాం. ఉపాధ్యాయులు సైతం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారు.

– గాయత్రి, విద్యార్థిని, పదో తరగతి

వీర తెలంగాణ చిత్రం గీశా..



అవకాశం రావడంతో పాఠశాల గోడలపై వీర తెలంగాణ చిత్రం గీశాను. కాగితంపై గీయడం సులువు. కానీ గోడలపై కొద్దిగా కష్టమే. అయినప్పటికీ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో తోటి విద్యార్థినులతో కలిసి పాఠశాల గోడలపై చిత్రాలు వేశాం.

– లక్షణ, విద్యార్థిని, పదో తరగతి

ప్రతిభను వెలికితీసేందుకే..



చదువుతోపాటు ఇతర అంశాల్లోని విద్యార్థినుల ప్రతిభ వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. పాఠశాల గోడలపై విద్యార్థినులే అందమైన చిత్రాలు గీశారు. క్రీడల్లోనూ పలువురు రాణిస్తున్నారు. – సుమలత, ప్రిన్సిపాల్, భైంసా

వేడి నీటికి తిప్పలు



భైంసాలోని బాలికల గురుకుల పాఠశాలలో వేడి చేసిన నీటిని విద్యార్థులకు అందిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు చన్నీటి స్నానమే దిక్కవుతోంది. అసలే చలికాలం కావడంతో చన్నీళ్ల స్నానం చేయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు ముందుకొచ్చి కట్టెల పొయ్యిపై వంటపాత్రల్లో నీటిని వేడి చేసి అందిస్తున్నారు. కానీ అనేక పాఠశాలల్లో వేడి నీరు లేక విద్యార్థుల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం వేడి నీటి వసతి ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



వేదం పాఠశాలలో గణిత ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జక్కోల్ల రమేశ్ వివరించారు. విద్యార్థులు గణితంలోని వివిధ ఆకృతుల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, దేవేందర్‌లు ఉన్నారు.

12 కేజీల 'బంగారు తీగ'

లక్ష్మణచాంద: చేపలవేటకు వెళ్లిన మండల కేంద్రానికి చెందిన మత్స్యకారులకు ఆదివారం భారీ చేప లభ్యమైంది. 12 కేజీల భారీ బంగారు తీగ రకానికి చెందిన చేప లభించడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన నలుగురు వ్యక్తులు కలిసి ఈ భారీ చేపను కొనుగోలు చేశారు.

బంగారు తీగ చేపతో మత్స్యకారుడు ➤



'అమిత్ షా క్షమాపణ చెప్పాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దేవ రవికుమార్, దర్శనం సాయన్న, పొట్ట నవీన్, దేవ చిన్ని, రవీందర్, పొట్ట రాజేశ్వర్, మైల రాజు, పొట్ట ప్రవీణ్, పులి అశోక్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



సర్టిఫికెట్లతో విద్యార్థులు

నిర్మల్‌టౌన్: అమ్మాయిలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సోన్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 120 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి సీఐ నవీన్ కుమార్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ ప్రేమ్ కుమార్, తైక్వాండో జిల్లా అధ్యక్షుడు రామారావులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, అమ్ముల భూషణ్, రాజ్ కుమార్, వంశీ, చిరంజీవి, మృణాళిని, పూనమ్, నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కం చెరువులో బర్డ్‌వాచ్



పర్యాటకులకు సూచనలు చేస్తున్న అటవీ సిబ్బంది

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీక్షేత్రం పరిధిలో పర్యాటక స్థలాలు తుర్కం చెరువు, యెంగన్న చెరువులో ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో బర్డ్‌వాచ్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి స్నేక్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వాహనాల ద్వారా అటవీ ప్రాంతానికి చేరుకుని రాత్రి ఏర్పాటు చేసిన ఫైర్ క్యాంపులో పాల్గొన్నారు. ఉదయం సఫారీ నిర్వహించి అటవీ ప్రాంతంలోని పక్షులు, జంతువులు, చెరువుల అందాలను తిలకించి కెమెరాలలో బంధించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వోలు శ్రీనివాస్, అన్నపూర్ణ ఉన్నారు.

'సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న రాజేందర్

కడెం: గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సామాజిక ఉద్యమకారుడు హపవత్ రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన

కడెం: బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. మధ్యాహ్న భోజన యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా బిల్లులు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇకనైన స్పందించి బిల్లులు, వేతనాలు చెల్లించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో కార్మికులు గంగామణి, సునీత, బుచ్చవ్వ, రజిత, ఎంకవ్వ, అశ్విని తదితరులు ఉన్నారు.

మొరం ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ శివారు ప్రాంతం నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా ఆరట్టు



ఖానాపూర్: పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆరట్టు కార్యక్రమం నర్సారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అయ్యప్ప భక్తుల సంకీర్తనలు, నృత్యాల మధ్య సోన్ గ్రామ సమీపంలోని గోదావరి నది తీరానికి పాదయాత్రగా పల్లకి ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మస్కాపూర్‌లో..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. నిజామాబాద్‌కు చెందిన అంజయ్య గురుస్వామి, ఖానాపూర్‌కు చెందిన పిసుపాటి పాపారావు, అర్చకులు సందీప్‌శర్మల ఆధ్వర్యంలో సామూహిక పడిపూజ నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్ కళాబృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

మహోర్‌లో..

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్ప దీక్ష స్వాములకు కుభీర్‌కు చెందిన పెంటాజి గురుస్వామి ఆదివారం మహారాష్ట్రలోని మహోర్ ఎల్లమ్మ ఆలయం వద్ద భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములు వివిధ వాహనాలలో వెళ్లి ఎల్లమ్మ మాతను దర్శించుకుని భిక్ష చేశారు.

పాపహరేశ్వరాలయంలో పూజలు



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

బాసర: బాసరలోని అతి పురాతన ఆలయం శ్రీ పాపహరేశ్వరాలయ శిఖర, ఉత్సవ విగ్రహ పునఃప్రతిష్టాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఆదివారం వైదిక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ పాపహరేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌పూజారి, వేద పండితులు నవీన్ శర్మ, అర్చకులు నగేశ్ అప్ప ఆధ్వర్యంలో పంచాచార్య పూజ స్థాపిత దేవతా మండపారాధన, హవనము బింబశుద్ధి, శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, చండీ హోమం నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన తదితర పూజలు చేశారు. చివరిరోజు సోమవారం శ్రీ పాపహరేశ్వర ఆలయంలో ఉత్సవ దేవతమూర్తులు, శిఖర ప్రతిష్టాపన, చండీ అంకురార్పణ పూజలు నిర్వహించనున్నారు.

దేవుని చెరువు జాతరకు పోటెత్తిన భక్తులు

నర్సాపూర్(జి): మండల కేంద్రం సమీపంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన దేవుని చెరువు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం పురోహితులు నరహరి శర్మ, జంగం గంగాప్రసాద్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి పూలు, పత్రి, పసుపు (బండారి)లతో రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రీతికరమైన కొత్త బియ్యంతో వండిన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఒగ్గు కళాకారుల పాదాలు కడిగి పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి వన భోజనాలు చేశారు. రాత్రి స్వామివారి పల్లకి సేవతో జాతర ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, నర్సాపూర్ (జి) ఎస్సై సాయికిరణ్, దిలావర్పూర్ ఎస్సై సందీప్, ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే..

దేవుని చెరువు జాతరకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విచ్చేసి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, కోడె సుధాకర్, బర్కుంట నరేందర్, దత్తురాం, గంగారాం ఉన్నారు.



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

శబరిమలలో అన్నదానం

నిర్మల్‌టౌన్: అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్, తెలంగాణ ఆధ్వర్యంలో శబరిమల సన్నిధానం దగ్గరలో గల తూలపల్లి గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో జనవరి 12, 13, 14 తేదీలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్‌కి చెందిన ట్రస్ట్ సభ్యులు, శబరిమల నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణను ఆదివారం మర్యాద పూర్వంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. అన్నదానానికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు జ్యోతిర్మయి, నిర్మల్‌కు చెందిన కోశాధికారి సాదం ఆనంద్, ప్రచార కార్యదర్శి మందాజీ మారుతి తదితరులు ఉన్నారు.

శబరికి మల్లాపూర్ వాసులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ నుంచి శబరిమలకు పలువురు భక్తులు తరలివెళ్లారు. ఆదివారం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన 24 మంది అయ్యప్ప భక్తులు బయలు దేరారు. ఇందులో భాగంగా కోతి దేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయం ముస్తాబు



ముస్తాబైన ఆలయం

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. సోమవారం నుంచి ఈనెల 25 వరకు ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొరిపెల్లి దినకర్ రెడి, అర్చకుడు చంద్రశేఖర్ శర్మ తెలిపారు.

కిరాణా అసోసియేషన్ సమావేశం

నిర్మల్‌టౌన్: నాందేడ్ జిల్లా భోకర్‌లో ఆదివారం నిర్మల్ కిరాణా అసోసియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. నిర్మల్ నుంచి భోకర్‌కు బస్సులో బయలుదేరి వెళ్లారు. కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ మాట్లాడుతూ.. నూతన కమిటీ ఎన్నికై సంవత్సరం గడిచిన సందర్భంగా సమావేశం నిర్వహించామన్నారు. అసోసియేషన్ కమిటీ సభ్యులను శాలువా, మెమొంటోతో సత్కరించారు.

కొనసాగుతున్న సర్వే

కుంటాల: ప్రభుత్వం అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వే కొనసాగుతోంది. ఆదివారం అధికారులు మండలంలోని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. సర్వేను ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం ఖాన్ పరిశీలించారు.